## క్లుప్తంగా

### ఆధ్యాత్మికత అలవరచుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ద్రోణంరాజు శశి తదితరులు

జగదాంబ: విద్యార్థులు విద్యతోపాటు ఆధ్యాత్మికత అలవరచుకోవాలని ద్రోణంరాజు శశి అన్నారు. సోమవారం ఆమె జీవీఎంసీ 39వ వార్డులో ఉన్న స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు సంస్థ వారు ఉచితంగా ట్యూషన్‌తోపాటు ఆధ్యాత్మికత విషయాలు, పురాణాలు, నృత్యంలో శిక్షణ అందిస్తూ అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పురాణ ఇతిహాసాలపై అవగాహన కల్పించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు గణపతిస్వామి, ఈశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు



కార్యక్రమంలో పాల్గొన్న పైడా డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు

అల్లిపురం: జాతీయ సేవా పథకంలో భాగంగా సోమవారం పైడా మహిళా డిగ్రీ కళాశాల, డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమక్షంలో ఆంధ్రా యూనివర్సిటీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ హరినాథ్, పైడా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సరోజ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సరోజ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామశేష, పైడా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మౌనిక, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

### సేవా దృక్పథం అవసరం

అల్లిపురం: విశాఖ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛభారత్ మిషన్ సందర్భంగా కళాశాలలో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కేఎల్ శిరీష, అనురాధ, డాక్టర్ జె.లావణ్య, డాక్టర్ బి.హైమావతి, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

### మహాగణపతికి 89 కేజీల లడ్డూ నివేదన



గణేషుడికి సమర్పించిన లడ్డూ

గాజువాక: ఎస్వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో గాజువాకలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాలకు తాపేశ్వరానికి చెందిన సురుచి ఫుడ్స్ నిర్వాహకులు భారీ లడ్డూ అందజేశారు. 89 అడుగుల మహాగణపతికి 89 కేజీల లడ్డూను ప్రసాదంగా అందజేసినట్టు ఉత్సవ నిర్వాహకుడు గణేష్ తెలిపారు. ఈనెల 29న స్వామివారి నిమజ్జనోత్సవం సందర్భంగా లడ్డూను వేలం వేస్తామని గణేష్ పేర్కొన్నారు. పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పల్లా కార్తీక్, సురుచి ఫుడ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.




# అంతటా అంధకారం

- 41వ వార్డులో సక్రమంగా వెలగని విద్యుత్ లైట్లు
- నేతాజీ వంతెన, రహదారుల్లో చిమ్మ చీకట్లు
- రాత్రిళ్లు రాకపోకలకు ఇబ్బందులు
- సమస్య పరిష్కరించాలని స్థానికులు, వాహన చోదకుల విజ్ఞప్తి



ఎఫ్‌సీఐ గిడ్డంగి వద్ద నేతాజీ ఫ్లైఓవర్ వంతెనపై అంధకారం



స్లీప్‌గుర్తులో వీధిలో అలుముకున్న చీకట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డులో అంధకారం నెలకొంది. జ్ఞానాపురం పరిధి బాబూ కాలనీ, సెబాస్టియన్ కాలనీ, స్లీప్‌గుర్తు వీధి, కొండ వీధి, మాన్యువల్ స్ట్రీట్, రాచ వీధి, డయాస్ వీధి, పోస్టాఫీస్ వీధి, పార్క్ స్ట్రీట్ ఎర్రిగెడ్డ వీధి ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు వెలగక చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఇక్కడ 48 బీ5/1/1 విద్యుత్ స్తంభం నుంచి పలు స్తంభాల లైట్లు సక్రమంగా వెలగడం లేదు. రాత్రి వేళ రాకపోకలు సాగించాలంటే మహిళలు, వృద్ధులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వాహన చోదకులు తంటాలు పడుతున్నారు. జీవీఎంసీ విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో వీధుల్లో కుక్కల బెడదతోపాటు దొంగతనాల జోరు ఎక్కువగా ఉందని చెబుతున్నారు.

**రాత్రి వేళల్లో దొంగతనాలు..**

జ్ఞానాపురం రైల్వే స్టేషన్ నుంచి కొందరు సంచార జాతుల వారు రాత్రి సమయంలో వీధుల్లో తిరుగుతూ దొంగతనాలు చేస్తున్నారని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. జ్యోతి నిలయం, సెయింట్ పీటర్స్ చర్చి ప్రాంతాల్లో రింగ్ లైట్లు సక్రమంగా పనిచేయడం లేదని వాపోతున్నారు. ఇటీవల ఫిర్యాదులు చేస్తే లైట్లు వేసిన రెండు మూడు రోజులకే మళ్లీ చీకట్లు కమ్ముకున్నాయని చెబుతున్నారు. జ్ఞానాపురం రైల్వే స్టేషన్ నుంచి కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో నేతాజీ ఫ్లైఓవర్ వంతెనపై విద్యుత్ లైట్లు వెలగక వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

**పట్టపగలే వెలుగులు..**

అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యంతో జ్ఞానాపురంలోని పలు వీధిల్లో విద్యుత్ లైట్లు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతుంటే.. మరికొన్ని చోట్ల పట్టపగలే విద్యుద్దీపాలు వెలుగులు ప్రసరిస్తున్నాయి. జీవీఎంసీ జోన్-5 కార్యాలయానికి కూతవేటు దూరంలో నిత్యం ఉదయం వేళ విద్యుత్ లైట్లు వెలుగుతున్నా.. పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. విద్యుత్ విభాగం అధికారులు పరిశీలించి వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.



జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయం సమీపంలో పగలు వెలుగుతున్న విద్యుత్ లైటు

### వీధిలైట్లు వెలగక ఇబ్బందులు

మా ప్రాంత వీధుల్లో విద్యుత్ లైట్లు వెలగక పోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. పాదచారులు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు చీకట్లో తంటాలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు కురిసేటప్పుడు రాత్రి సమయంలో విషకీటకాలు రోడ్లపైకి వస్తున్నాయి. అధికారులు స్పందించి వీధి లైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలి.

– ఎస్.రజని, మాన్యువల్ స్ట్రీట్, జ్ఞానాపురం

### అధికారులు చర్యలు చేపట్టాలి

జ్ఞానాపురం రైల్వే స్టేషన్ నుంచి కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెనకు వెళ్లే మార్గంలో విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగడం లేదు. చీకట్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. జ్ఞానాపురంలోని పలు వీధుల్లో అంధకారం నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– ఎస్.ఆనందరావు, జ్ఞానాపురం

## కేజీహెచ్‌కు వైద్య పరికరాల వితరణ

మహారాణిపేట: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఎ.రెహమాన్ ఆధ్వర్యంలో బి.భారతిదేవి సమకూర్చిన ఈసీజీ మానిటర్, బీపీ ఆపరేటర్లను సోమవారం కేజీహెచ్‌లోని కార్డియాలజీ వార్డుకు అందజేశారు. ఈ వైద్య పరికరాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

**కేజీహెచ్‌లో ఎమ్మెల్యే పర్యటన**

కేజీహెచ్‌లో సోమవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పర్యటించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌తో కలిసి వివిధ విభాగాల్లో ఉన్న రోగులను పరామర్శించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు, సిబ్బంది పనితీరుపై రోగులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కేజీహెచ్‌లో మరిన్ని సదుపాయాలతోపాటు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని చెప్పారు.



కేజీహెచ్‌లో వైద్య పరికరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎస్.ఎ.రెహమాన్

### గాయకులకు సన్మానం



విశ్వప్రసాద్, కోమలి దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

అల్లిపురం : సంగీత కళా రంగానికి విశేష సేవలందిస్తున్న గాయక దంపతులు విశ్వప్రసాద్, కోమలిని నిర్వాహకులు సోమవారం ఘనంగా సత్కరించారు. విజయ విశాఖ మ్యూజికల్స్ ఈవెంట్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం డాబాగార్డెన్స్, అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వప్రసాద్, కోమలి పాడిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రెడ్డి ప్రభ, అలేఖ్య, తులసి, శోభ, సత్యవతి, పింకీ, ఎస్ఎన్‌రావు, వెంకట్, హిమ, కైలాస్, శ్రీనివాస్, మధు పాల్గొని గీతాలు ఆలపించి ప్రేక్షకులను అలరించారు.

## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

అల్లిపురం/మహారాణిపేట : కేంద్రం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, 2021కి ముందు అమలులో ఉన్న 44 లేబర్ చట్టాలను తిరిగి పునరుద్ధరించాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్‌లో నిరశన తెలిపారు. భారతీయ కార్మిక వర్గం స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారితో పోరాడుతూనే కార్మిక సమస్యలపై గలమెత్తి ట్రేడ్ యూనియన్ యాక్ట్, ఫ్యాక్టరీస్ యాక్ట్ వంటి చట్టాలతోపాటు 44 కార్మిక చట్టాలను సాధించుకుందని గుర్తు చేశారు. అలాగే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ బ్లాక్ డే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం అక్టోబర్ 2, 3, 4 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరశన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు, అధ్యక్షుడు ఎం.మన్మథరావు, సహాయ కార్యదర్శి ఎస్.కె.రహమాన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, బి.జగన్, భోగవిల్లి నాగభూషణం, ఎన్.కనకరావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ఏపీఐఐసీ స్థలాన్ని రక్షించండి

మహారాణిపేట: పెందుర్తి మండలం గుర్రంపాలెంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీకి తమ సొంత స్థలాలు ఇచ్చామని, స్థానికులైన తమకు ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదని గ్రామ ప్రజలు వాపోయారు. ఉద్యోగాలు ఇస్తామన్న హామీలను కూడా నేటి వరకు అమలు చేయలేదని, ఈ స్థలాన్ని ఇప్పుడు కొంత మంది ఆక్రమించడానికి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు వారు మొరపెట్టుకున్నారు. భారీ వాహనాలు రాకపోకలు సాధించేందుకు ఏపీఐఐసీ కొత్త రోడ్డు నిర్మిస్తోందని, ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు కొంత మంది ప్రజాప్రతినిధులతో కలిసి ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు చిన్నది కావడంతో ఏపీఐఐసీ పెద్ద రోడ్డు నిర్మించడం కోసం స్థలం కేటాయించిందని గ్రామ ప్రజలు వివరించారు. ఏపీఐఐసీ పెద్ద రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తుండగా.. ప్రజాప్రతినిధులు అడ్డుకోవడం బాధగా ఉందని చెబుతున్నారు. రామవరం, ఎర్రవానిపాలెం తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ రోడ్డు నిర్మించడంతోపాటు ఇక్కడ స్థాపించిన పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశం కల్పించాలని కలెక్టర్‌కు గుర్రంపాలెం ప్రజలు కోరారు.

## వార్డెన్ ప్రసాదరావు సస్పెన్షన్ అన్యాయం

మహారాణిపేట : సీతమ్మధార సాంఘిక సంక్షేమ వసతి గృహం వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.ప్రసాదరావుని సస్పెండ్ చేయడం అన్యాయమని నవయానం బహుజన సంక్షేమ సంఘం కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రసాదరావు ఎస్సీ బాలుర వసతి గృహం సీతమ్మధారలో గత 2 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. గత 32 ఏళ్లుగా సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో వివిధ వసతి గృహాల్లో విధులు నిర్వహించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు ఉత్తమ ఆఫీసర్ అవార్డు, ప్రసంశా పత్రాలతో సత్కరించాయని గుర్తు చేశారు. అటువంటి ప్రసాదరావు సస్పెన్షన్‌ను రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను వార్డెన్ ప్రసాదరావు, విద్యార్థులు కలిశారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సంఘం నాయకులు

### కలెక్టర్‌తో సింహాచలం ఈవో భేటీ

మహారాణిపేట: సింహాచలం దేవస్థానం కార్య నిర్వహణాధికారి (ఈవో)గా పదవీ బాధ్యతలు చేపట్టిన వి.త్రినాథరావు సోమవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు సింహాచలం ప్రసాదం అందజేశారు.



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ప్రసాదం అందజేస్తున్న సింహాచలం ఈవో త్రినాథరావు

### త్వరగా ప్రజా సమస్యల పరిష్కారం



వినతిపత్రం స్వీకరిస్తున్న జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము

కంచరపాలెం : జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ – 5 కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో పలు సమస్యలపై సోమవారం 07 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 04, రెవెన్యూకు 02, ఇంజినీరింగ్ విభాగానికి 01 వినతి వచ్చినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో ఈఈ తారా ప్రసన్న రెడ్డి, ఏసీపీ ఇన్‌చార్జి విజయకుమార్, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీలు పద్మావతి, సూపరింటెండెంట్‌లు రాజు, వెంకటరమణ, కార్యాలయ సిబ్బంది శేఖర్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సహకారంతో కాలుష్య రహిత నగరం



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి

అల్లిపురం: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా.. దాని నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయించిదన్నారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాలను ఉపయోగిస్తున్నారని చెప్పారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో-జీరో పొల్యూషన్ కార్యక్రమాల్లో భాగంగా విశాఖ నగర పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిత్యం చేపడుతోందని తెలిపారు. వారంలో ఒక రోజు ప్రజా రవాణా వ్యవస్థను, సైకిళ్లను ఉపయోగించడం వల్ల నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చని, ప్రజలందరూ సహకరించాలని కోరారు.

## ఎప్పటికప్పుడు చెత్త సేకరించాలి



వార్డు కార్యాలయంలో పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: వార్డుల్లో చెత్త ఎప్పటికప్పుడు నూరు శాతం సేకరించాలని జీవీఎంసీ జోన్ – 4 కమిషనర్ మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం ఆయన 28వ వార్డు నెహ్రూబజార్, రామ్‌నగర్ ప్రాంతల్లో పర్యటించారు. ముందుగా వార్డు కార్యాలయాలు పరిశీలించి మాట్లాడారు. వార్డుల్లో డస్ట్‌బిన్ల వద్ద చెత్త కుప్పలు ఉండకుండా రోజూ శుభ్రం చేయాలన్నారు. అలాగే క్లాప్ వాహనాలు వీధుల్లోకి రోజూ ఉదయం ఆరు గంటలకే వెళ్లి చెత్త సేకరించాలన్నారు. ఎక్కడైతే వాహనాలు వీధుల్లోకి వెళ్లలేని పరిస్థితి వుందో ఆ వీధి చివర పార్కింగ్ చేసి పారిశుధ్య కార్మికులు చెత్త సేకరించాలన్నారు. నివాసదారులు పారిశుధ్య కార్మికులకు తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు వేసి ఇవ్వాలని సూచించారు. వాహనచోదకులు ప్రతీ సారీ 600 కేజీలకు పైగా చెత్త సేకరించి, యార్డుకు తీసుకెళ్లాలని... లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ సెక్రటరీలు కూడా ఉదయాన్నే విధుల్లో చేరి పారిశుధ్య పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల పక్కన చెత్త కుప్పలు ఉండకూడదన్నారు. ఆయనతోపాటు వార్డు ఇన్‌స్పెక్టర్ సురేష్, సిబ్బంది ఉన్నారు.

## పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

అల్లిపురం : విశాఖ నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో ముఖ్య భూమిక పోషిస్తున్న జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ, సంక్షేమమే ధ్యేయంగా సఫాయిమిత్ర సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం జోన్ – 4 పరిధి కొబ్బరితోట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో స్వచ్ఛత హీ సేవా - 2024లో భాగంగా సఫాయి మిత్ర సురక్ష శిబిరం పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో నిరంతరం పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికుల ఆరోగ్యం కోసం పరీక్షలు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏఎంవోహెచ్ కృష్ణంరాజు, ఎన్‌యూహెచ్‌ఎం కన్సల్టెంట్ శశిభూషణ్, శానిటరీ సూపర్‌వైజర్ కిషోర్ కుమార్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీవీఎస్ నాయుడు, బి.ప్రత్యూష, మాధురి, చైతన్య పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు జర్నలిస్టు సంఘాల వినతి



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు సమస్యలు విన్నవిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

మహారాణిపేట: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు స్కూళ్లలో 50 శాతానికి పైగా ఫీజు రాయితీ కల్పించాలని, పెండింగ్ అక్రిడేషన్లు జారీ చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు జర్నలిస్టు సంఘాలు వినతిపత్రాన్ని అందజేశాయి. వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీం కింద జర్నలిస్టుల ప్రీమియం చెల్లింపునకు సీఎస్సార్ నిధులు కేటాయించినందుకు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు అధికంగా ఉండటం వల్ల జర్నలిస్టులకు భారమవుతోందని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గతంలో విశాఖతోపాటు కొన్ని జిల్లాల్లో ఫీజు రాయితీ కల్పిస్తూ మెమో ఉత్తర్వులు జారీ చేశారని, ఈ ఏడాది కూడా రాయితీ కల్పించి సహకరించాలని కోరారు. గత ఎన్నికల ముందు నుంచి పలువురు జర్నలిస్టులకు ప్రెస్ అక్రిడేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే జారీ చేసి హెల్త్ కార్డులు పొందేందుకు అవకాశం కల్పించాలన్నారు. స్పందించిన కలెక్టర్ సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌తో మాట్లాడి అక్రిడేషన్ల సమస్య పరిష్కరిస్తానని, ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు రాయితీకి సహకరిస్తానని తెలిపారు. ఏపీయూ డబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు కె.చంద్రమోహన్, జాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎం.కీర్తన్, ఏపీజేయూ అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీధర్, ఎం.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఆర్‌ఏ కొనసాగించాల్సిందే..

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఇంటి అద్దె (హెచ్‌ఆర్‌ఏ), ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, ఎల్‌టీఏలను నిలిపి వేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లో ఈ అంశంపై ఆందోళన చేశారు. సీఎండీ కార్యాలయం ముందు బైఠాయించారు. దీంతో హెచ్‌ఆర్ సీజీఎం కార్మిక సంఘాలతో జరిగిన చర్చల్లో డైరెక్టర్ (పర్సనల్) సమక్షంలో చర్చలు జరపడానికి ప్రతిపాదించారు. దీనికి అంగీకరించని కార్మిక సంఘాలు నిర్ణయాధికారం ఉన్న సీఎండీతో మాట్లాడతామని పట్టుబట్టారు. దీంతో సీఎండీ అరుణ్ కాంతి బాగ్చీ, డైరెక్టర్ ఎస్.సి. పాండే, హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీలతో చర్చించారు. ఉత్తర్వులు రద్దుపై పునఃపరిశీలించడానికి సీఎండీ బాగ్చీ సమయం కోరారని నాయకులు తెలిపారు.

## స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ఉక్కునగరం: సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్‌ను విలీనం చేయడంతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఉక్కు కార్మిక సంఘాలు అన్నారు. స్టీల్ ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద సోమవారం పెద్ద ఎత్తున ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు పడుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత పరిస్థితికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. పూర్తి సామర్థ్యంతో ప్లాంట్ నడిపితే మనుగడ ఉంటుందన్నారు. అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్. రావు, డి. ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, వై.టి.దాస్, జె. రామకృష్ణ, నరేష్‌కుమార్, వరసాల శ్రీనివాస్, దొమ్మేటి అప్పారావు, మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.